# ప్రబోధ 5

చేతులారంగ శివుని పూజింపడేని
నోరు నొవ్వంగ హరికీర్తి నుడువడేని
దయయు సత్యంబు లోనుగా దలపడేని

ఈ మూడు పాదములయందు అనంతమైన వేదము, వేదములోని కర్మ, ఉపాసన, జ్ఞాన కాండములు యిమిడి వున్నవి. చేతులారంగ శివుని పూజింపడేని యిది కర్మకాండ. నోరునొవ్వంగ హరికీర్తి నుడువడేని, ఇది ఉపాసనకాండ, దయయు సత్యము లోన తాదలపడేని, యిది జ్ఞానకాండ. మూడు కాండలతో మూమ్మూర్తిస్వరూపాన్ని ధరించినప్పుడే మానవ జన్మ సార్థకమవుతుంది. లేకున్నపుట్టలుం తల్లులకడుపు చేటు.

వేదసారము ఉపనిషత్తులు. ఉపనిషత్ సారము భగవద్గీత. భారతీయులు భగవద్గీతను ప్రధానలక్ష్యమునందుంచుకొని సర్వత్రా వ్యాపింపజేస్తున్నారు. కానీ వ్యాపింప చేయుటం గొప్పతనము కాదు. ఆచరించటం, ఆచరింపచేయుటము అత్యవసరము. సాధన చేసినప్పుడే జీవితము సంపూర్ణమైనదిగా దివ్యమైనదిగా, సత్యమైనదిగా రూపొందే అవకాశము వున్నది.

సాధనను పెట్టుకోవలసిన త్రోవ ఏది? ఎక్కడనుండి వచ్చామో తిరిగి అక్కడికే చేరుకోవాలి. అదే మన త్రోవ. శృణ్వంతు విశ్వే అమృతస్యపుత్రాః. మీరు అమృత పుత్రులు. దీనినే భగవద్గీతలో 'మమైవాంశో జీవలోకే జీవభూతస్సనాతనః' అని కృష్ణుడు చెప్పాడు. నా అంశమే మీరు. సనాతనమైన నా అంశమే నూతనమైన దేహములు ధరించి యీ లోకమునకు వస్తున్నవి. మీరు ప్రకృతి అంశము, లోకాంశము, దేహాంశము, జీవాంశము కారు, దైవాంశములు. దైవత్వం సర్వత్ర వ్యాపించినటువంటిది. 'సర్వతః పాణిపాదం సర్వతోక్షి శిరోముఖమ్ .... సర్వత్ర వున్న దివ్యత్వము యేరూపంలో యేనామముతో అందుకోటం సాధ్యమవుతుంది. సర్వరూపములు సర్వనామములు తనవే. అలాంటి దివ్యత్వాన్ని గుర్తించటానికి నిజమైన చదువు కావాలి.

చదివించిరి నను గురువులు
చదివితి ధర్మార్థ ముఖ్య శాస్త్రంబులునే
జదివినవి కలవు పెక్కులు
చదువులలో మర్మమెల్ల జదివితి తండ్రీ!

అన్నాడు ప్రహ్లాదుడు. ఏమిటా చదువు? దైవాన్ని గుర్తించే చదువు. అనేకత్వములో వున్నయేకత్వాన్ని దర్శించే చదువు. మన గమ్యాన్ని పెట్టుకోటమే నిజమైన చదువు.

లోకం అనిత్యం అసుఖం. పనినిమిత్తం పట్టణాం వెళ్లినప్పుడు హోటల్ గదిలో బసచేస్తాం, హోటల్లో సమస్త సౌకర్యాలు, అనుకూలాలు వున్నాయికదా అని అందులో నే శాశ్వతంగా వుండటా

నికి విలువకాదు కదా! వచ్చిన పని పూర్తి కాగానే యెక్కడనుండి వచ్చినామో అక్కడకు చేరుకోవలసిందే. చేరుకోక తప్పదు. మనమెక్కడనుండి వచ్చినది మరచి యెక్కడకు చేరాలో తెలియక కాలము వ్యర్థము చేయుచున్నాము. ప్రాణము యెక్కడ యేక్షణములో పోతుందో చెప్పలేము. కనుక వున్నంతకాలములో ప్రోగు చేసుకోగలిగినంత పవిత్రతను ప్రోగు చేసుకొని ఆదర్శవంతమైన జీవితాన్ని గడపాలి.

ఈనాడు లోకములో అర్థ, అధికారతృష్ణ మితిమీరి పోతున్నది. ఇది మితిమీరటంచేతనే మానవులమతికూడా చెడిపోతున్నది. జగత్తును సస్యశ్యామలం చేస్తూ ప్రతి ప్రాణికి అన్నపానీయాలనందిస్తూ మూ ఆధారముగా వుంటున్న సముద్రము సైతము ఒక హద్దులో వుంటుంది. ఈ హద్దు దాటితే ప్రళయమే. అంత అగాధమైన సముద్రము కూడా అణిగి మణిగి వుంటూ ప్రాణికోటికి సుఖ శాంతులనందిస్తున్నది. మనము కూడా ఆశలను అదుపులో పెట్టుకున్నప్పుడే అవి సుఖ శాంతులను అందించగలవు. ఆశలను మితిమీరి పెంచుకుంటే విరుద్ధ ఫలితాన్ని అనుభవించవలసి వస్తుంది.

ప్రాచీన మహర్షుల కీర్తి జగద్వ్యాపకము కావటానికి వారి ప్రవర్తనే కారణము. ఆవిధమైన కీర్తిని మర్యాదను పొందాలనుకుంటే మన నడతలు మంచివై వుండాలి. ఎన్నిపట్టములందుకున్నా ప్రవర్తన సరిగా లేకున్నా అన్నీ నిష్ప్రయోజనము. ప్రపంచములో సర్వపదార్థములు వున్నాయి. కానీ యివన్నీ మార్పుచెందేవి కనుక అన్నీ శూన్యమే. జగత్ — జ పుట్టటం గత్ - మార్పుచెందటం. పుట్టేది పోయేది కనుకనే దీనికి జగత్ అని పేరు. మనకు కనిపించకుండా వున్నది శూన్యమనుకుంటాము. కానీ నిజానికి ఆ శూన్యమే సర్వము.

మనకర్మను బట్టి ఫలితమును పొందుతుంటాము. ఆశించిన కర్మానుభవము నిమిత్తమే జన్మలు వచ్చేది. కర్మలలో నిష్కామ కర్మవల్ల రెండు సుఖాలు కలుగుతాయి. ఒకటి చిత్తశుద్ధి. రెండోది వాంఛల నిర్మూలనము. కామ్యకర్మల ఫలితము అనుభవించటానికి పునరపి జననం, పునరపి మరణం. ఇక రాకపోకలు లేని నిత్యసత్య నిర్మల తత్వాన్ని పొందేదెప్పుడు?

కనుక నేలోక విద్యలతో పాటు ఆధ్యాత్మిక విద్యను కూడా కొంత రుచి చూడాలి. అనుభవించి ఆనందించి అందరికీ పంచిపెట్టాలి. ఇదే జీవిత లక్ష్యము. ఈ జీవిత గమ్యాన్ని చేరటానికి వయసు ప్రధానము కాదు. వయసు దేహానికి. ఆత్మకు వయసు లేదు. రూపం లేదు. ఇది కేవలము ఆనందమయము. ఇట్టి ఆనందమయత్వము కోసము ఆదర్శ వాంఛలను అభివృద్ధి పరచుకోవాలి. మాతృమూర్తులు కావలసిన స్త్రీలు పవిత్ర జీవితాన్ని పోషించుకోవాలి. సంసారాన్ని భుజము మీద, సర్వేశ్వరుని హృదయములో పెట్టుకొని ఆదర్శవంతమైన జీవితాన్ని గడపాలి. మన మీ మృణ్మయ జగత్తులో వుంటూనే చిన్మయాన్ని పొందాలి. మట్టినుండి పుట్టింది కుండ. కుండలో మట్టి వుంది. కాని మట్టిలో కుండ లేదు. మృణ్మయములో చిన్మయమంటే అదే. రథోత్సవాన్ని చూడబోయి ఆడవాళ్ళను మూగిన గుంపులను చూసేవాళ్ళు యెందరో వుంటారు. రథంలో చిన్మయ మూర్తిని చూడాలి. దేహం భగవంతుని ఊరేగించే రథము. భగవంతుని ప్రతిష్ఠించిన ఒక మందిరము, ఒక క్షేత్రము, పుణ్యతీర్థము.

ఒక రాజుగారు గ్రామస్తులను పిలచి తలా ఒక మేకా యిచ్చి బాగా పెంచండని

చెప్పాడట. అయితే వాటిని తన దగ్గరకు తీసుకొని వచ్చినప్పుడు అవి ఆకులు తినకుండా చూడాలి అని ఒక
షరతు విధించాడు. ఆ విధముగా మేకలను పెంచిన వారికి పదివేల రూపాయలు బహుమానమిస్తానని కూడా
ప్రకటించాడు. బాగా మేపితే యిక ఆకులనెట్లా తింటుందనుకొని బాగా మేపసాగారు అంతా. ఒక అమ్మాయి
మాత్రం తన మేక ముందర ఆకులు పెట్టి అది మేయబోయేసరికి దాని మూతిపైన కొట్టేది. ఆ మేక ఆకులన్నీ
వాటివైపు చూడటమే మానేసింది. ఒకరోజు రాజుగారు అందరిని మేకలు తీసుకొని రమ్మని ఆజ్ఞాపించా
రు. అందరి మేకలు ఆకులను చూడగానే తింటున్నాయి. ఒక మేక మాత్రం ఆకులవైపు చూడకుండా తన
యజమాని చేతిలో వున్న కట్టెను మాత్రమే చూస్తున్నది. రాజుగారు ఆ మేకను పెంచిన అమ్మాయికి
పదివేల రూపాయల బహుమానంగా యిచ్చారు. మనసును అరికట్టుకోటానికి యీ విధమైన అభ్యాస
ము చేయవలసి వుంటుంది. అర్జునుడంతటివాడు చంచలంహి మనః కృష్ణా ప్రమాది బలవద్దృఢమ్
బలవత్తరమైన మనస్సును యే విధముగా అరికట్టుకోవాలని ప్రార్థించాడు. అది యిష్టం వచ్చినట్లు పరుగు
తెత్తుతుంది. దానికొక దారి తెన్నూ లేదు. కోతైనా ఒక చెట్టునుండి యింకొక చెట్టుకు దూకుతుంది.
కానీ మనస్సు క్షణంలో ఒక లోకమునుండి మరొక లోకానికి చేరుతుంది.

ఒక రాజుగారు గొప్ప ప్రదర్శనమొకటి యేర్పాటు చేశాడట. ఆ ప్రదర్శన ప్రత్యేకత
యేమిటంటే యెవరు యిష్టం వచ్చినవి వారు యథేచ్ఛగా తీసుకొని పోవచ్చు. అందరూ వచ్చి యెవరికి నచ్చి
నవి వారు తీసుకొని పోతున్నారు. ఒక అమ్మాయి మాత్రము వుత్త చేతులతోనే తిరిగి పోతున్నది. రాజు
ఆమెను నా ప్రదర్శనలో నీకిష్టమైనది ఒక్కటి కూడా లేదా, దేనిమీద కూడా నీకు ఆశ లేదా అని అడిగాడు. ప్రద
ర్శన చాలా అద్భుతముగా వుంది. నాకూ ఆశ లేక పోలేదు. కానీ ఒక దానిని ఆశిస్తే ఆశ అంతటితో ఆగదు
ఆశలు అనంతముగా పెరిగి పోతుంటాయి. ఆశకు దాసురాలిని కాకుండా ఆశను జయిస్తే ఆశలే మనకు
వశమవుతాయి అని చెప్పిందా అమ్మాయి. ఆ అమ్మాయి మాటలకు ప్రభావితుడైన రాజు నీకేది కావాలో
కోరుకో నేనిస్తానని అన్నాడు. తప్పక యిస్తారా అని అడిగింది. తప్పక యిస్తానని మాట యిచ్చాడు రాజు. నాకు
మీరే కావలన్నది. యిచ్చిన మాట ప్రకారము రాజు ఆ అమ్మాయిని తన రాణిగా స్వీకరించాడు. అంత గొప్ప ప్రద
ర్శన అందులోని వస్తువులన్నీ ఆమె వశమైనాయి. అత్యంత అద్భుతమైన సృష్టి యీ ప్రదర్శన. ఎవరికి
యిష్టమైనది వారు తీసుకుంటున్నారు. రాజా నాకేమీ అవసరం లేదు, వీటినన్నిటిని సృష్టించిన వారెవరో
వారే నాకు కావాలని దైవాన్నే తనసొత్తుగా చేసుకొన్నది వైరాగ్యానికి మూర్తీభావమైన ఆ బాలిక.

చేపలు పట్టేవారు నదిలో వల వేస్తారు. చేపలు వలవైపు పోతే అందులో చిక్కు
కుంటాయి. వల వేసిన వాళ్ళవైపు వస్తే వలను తప్పించుకుంటాయి. ఈ ప్రపంచమే వల అనే మాయ.
దానివైపు పోతే అందులో బంధితులౌతారు. ఆ మాయను సృష్టించిన వాని పాదాలవైపు నడిస్తే
విమోచనం లభిస్తుంది.

అశ్వత్థామ అంత్యకాలములో వున్న దుర్యోధనుణ్ణి సమీపించి నీ ప్రాణం పోయేలో
పల పాండవుల శిరస్సులు తెచ్చి నీకు శాంతి చేకూరుస్తానని చెప్పి అక్కడనుండి బయలుదేరుతాడు.
పాండవులు చిక్కలేదు. పాపం ద్రౌపది పుత్రులు చిన్న బిడ్డలు నిద్రపోతున్న ఆ ఉపపాండవుల గొంతుకలు

కోసి తెచ్చి చూపించాడు. అప్పుడు దుర్యోధనుడు శాంతిగా మరణించాడుట. పుత్రశోకముతో దుఃఖిస్తున్న ద్రౌపదిని అర్జునుడు ఓదారుస్తూ క్షణములో అశ్వత్థామ శిరస్సును ఖండించి నీకాళ్ళముందరవేస్తాను. దానిని త్రొక్కి నీవుస్నానమాడుదువుగాని అని వెంటనే అక్కడినుండి బయలుదేరాడు. అశ్వత్థామను పట్టి తెచ్చాడు. ఆమె కాళ్లముందర శిరస్సును ఖండించాలని కత్తి యెత్తబోయే సమయములో ద్రౌపది అశ్వత్థామను చూసింది. ఐదుగురు కొడుకులను పోగొట్టుకున్న తల్లికి యెంత కష్టంగావుంటుంది. కాని ఆమె అంటుంది అయ్యో అశ్వత్థామా!

పరగన్ మా మగవారలందరున్ మున్ బాణప్రయోగోప సం
హరణాద్యాయుధ విద్యలన్నియును ద్రోణాచార్యుచే నభ్యసిం
చిరి పుత్రాకృతి నున్న ద్రోణుడవు నీ చిత్తంబులో లేశమున్
కరుణారసంబు లేక శిష్యసుతులన్ ఖండింపగా బాడియే.

మీతండ్రిగారు నాభర్తలకు గురువు. మీరు మా బిడ్డలకు గురువులు. అలాంటి మీరు యీ బిడ్డలను సంహరించటానికి చేతులెట్లాడినవి స్వామీ! ఎంత సహనముగా పలికిందో చూడండి.

ఉద్రేకంబున రారు, శస్త్రధరులై యుద్ధావనిన్ లేరు, కిం
చిద్రోహంబును నీకు చేయరు బలోత్సేకంబుతో ఒకటన్
భద్రాకారుల జిన్నిపాపల, రణప్రౌఢక్రియా హీనులన్
నిద్రాసక్తుల సంహరింపనకటా! నీ చేతులెట్లాడెనో.

ఈరీతిగా ప్రార్థిస్తుంది. అది చూచి భీముడు

కొడుకుల బట్టి చంపెనని కోపము నొందదు బాలఘాతకున్
విడువుమటంచు చెప్పెడిది వెఱ్ఱిది ద్రౌపది వీడు విప్రుడే

కొడుకులు పోయి పిచ్చిపట్టింది పాపం. ఇలాంటి దుర్మార్గుల్ని విడిచిపెట్టమంటుంది పాపం.

విడువగ నేల చంపుడిటు వీనిని మీరలు చంపరేని నా
పిడికిటి పోటునన్ శిరము భిన్నము చేసెద చూడుడందరున్.

అన్నాడు. భీమునికి అడ్డువచ్చింది ఆ సాధ్వీమణి. స్త్రీకి సాత్వికం ప్రధాన గుణముగా వుండాలి. తరువాత తమోగుణం సిగ్గు, ఎగ్గు, బిడియం. అవసరం వచ్చినా త్యాగానికైనా సిద్ధముగావుండాలి. అది రజోగుణం. అది కడపటిదిగా వుండాలి.

అశ్వత్థామను సంహరించటం మంచిది కాదని నీ భర్త వాగ్దానం నెరవేరకుండా చేస్తావా, మాట తప్పాడనే అపకీర్తిపాలు చేస్తావా అన్న అర్జునునితో అతని శిరోజములు ఖండించి మన వాకిటనుండి అవతలకు నెట్టివేయండి చచ్చినవానితో సమానమై పోతాడు అనగా

విశ్వస్తుత్యుడు శక్రసూనుడు మహావీరుండు ఘోరాసిచే
నశ్వత్థామ శిరోజముల్ దఱిగి చూడాంతర్మహారత్నమున్
శశ్వత్కీర్తి వెలుంగ బుచ్చుకొని పాశవ్రాత బంధంబులన్

3-20-01-87-05

విశ్వాసంబున నూర్ఛ్ఛిత్రోచె శిబిరోర్వ్యభాగంబు బాసిపోన్.

వారు తెలియక పాపం చేశారు. మనము ఆ విధముగా పాపము చేయకూడదు. అని చెప్పి ఆ తల్లి యెంత సహనం చూపింది. అట్టి సహనాన్ని అలవరచుకోవాలి. స్త్రీలు యిట్టి సాత్త్విక హృదయము తో వెలిగినప్పుడే దేశము నిత్యకళ్యాణం పచ్చని తోరణంగా కళకళలాడుతూ కిలకిలానవ్వుతూవుంటుంది.

శ్రీసత్యసాయి మహిళాకళాశాల
అనంతపురము.